క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ కమర్షియల్ కాంప్లెక్స్ ఫీడర్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిస్ బ్యాంక్ రోడ్డు, గొల్లపూడి డైమండ్స్ అపార్ట్‌మెంట్ ఏరియా, టీటీడీసీ ఆఫీస్ ఏరియా, హైస్కూల్ ఏరియా, సీ అండ్ టీ టవర్స్ ఏరియా, బాలాజీ టవర్స్ ఏరియా, మహాత్మాగాంధీ కమర్షియల్ కాంప్లెక్స్, మహేందర్ నగర్, టెలికాం కాలనీ ఏరియా, అంబేడ్కర్ నగర్ ఏరియా, వ్యవసాయ మార్కెట్ ఏరియాలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం జరిగింది. జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు మురళీధర్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక సామాన్య ప్రజల్లో మూఢ నమ్మకాలను పోగొట్టి శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. కొండపల్లి పట్టణ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మామిడి సీతారామారావు, జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీమోహన్, ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఎస్.నాగరాజు, ప్రధాన కార్యదర్శి షేక్ సర్దార్ పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ జయంతి



ముసునూరు: ముసునూరులో భగీరథ జయంతి ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం స్థానిక సగర సంఘం ఆధ్వర్యంలో సగర వంశ మూల పురుషుడు భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. స్థానిక సగర సంఘ నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

గోశాలకు ఆర్థిక సాయం



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీ తిరుపతమ్మవారి ఆలయ గోశాలలో గోవుల సంరక్షణకు మంగళవారం గుంటూరు జిల్లా రాజుపాలెం గ్రామానికి చెందిన చేవూరు చిన్న నాగేశ్వరరావు రూ.20 వేలు విరాళం ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ఉత్తమ సేవా పురస్కారానికి శ్రీహర్ష ఎంపిక



భవానీపురం(విజయవాడపశ్చిమ): హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆలిండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పీవీకేఎస్ హర్ష ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపిక అయినట్లు సంస్థ వ్యవస్థాపక చైర్మన్ అయ్యప్ప అరుణాచల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాధరపురానికి చెందిన పోతరాజు వెంకట కాళి శ్రీహర్ష సంస్థ పక్షాన అందిస్తున్న సేవలకు గాను ఈ పురస్కారాన్ని వచ్చే నెల విజయవాడలో ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన మానవ హక్కుల పరిరక్షణ, బాధితులకు న్యాయం కలిగేలా సంస్థ ప్రతినిధులు విశేష సేవలు అందిస్తున్నారని, అందులో భాగంగా శ్రీహర్షకు ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చింతూరు(అల్లూరి జిల్లా): మండలంలోని కాటుకపల్లి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంపలగూడెంకు చెందిన మహిళ సాదినేని లక్ష్మి (45) మృతి చెందింది. గంపలగూడెంకు చెందిన ఏడుగురు సభ్యులు గల కుటుంబం సోమవారం మారేడుమిల్లి అందాలను తిలకించేందుకు వచ్చారు. మంగళవారం తిరుగు ప్రయాణంలో వారు ప్రయాణిస్తున్న కారు కాటుకపల్లి వద్ద అటవీ ప్రాంతంలో అదుపు తప్పి చెట్టుకు బలంగా ఢీ కొంది. ఈ ఘటనలో లక్ష్మి అక్కడికక్కడే మృతిచెందగా మరో నలుగురికి గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధికి చిరునామా గొల్లపూడి

- డీబీటీ స్కీమ్స్ ద్వారా రూ.120 కోట్లు
- రూ.105 కోట్లతో నాన్ డీబీటీ ద్వారా ఇళ్ల స్థలాలు, ఇతర స్కీమ్స్
- రోడ్లు, డ్రెయిన్లు, భవనాలు, ఇతర నిర్మాణాలకు రూ.60 కోట్లు వ్యయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామం అభివృద్ధి పథంలో పయనించింది. గత ఐదేళ్లలో సంక్షేమం, అభివృద్ధికి ఈ గ్రామం చిరునామాగా మారింది. కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా మొత్తం రూ.285 కోట్లతో అభివృద్ధి సాధించింది. అందులో వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి రూ.120 కోట్లు డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ అయ్యింది. నాన్ డీబీటీ (ఇళ్ల స్థలాలు, ఇతర స్కీమ్స్) ద్వారా ఇచ్చినవాటి విలువ రూ.105 కోట్లు. ఇక రోడ్లు, సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్లు వంటి భవనాలు, సాయిపురం కాలనీలో వాటర్ ఫిల్టర్ బెడ్, ఇతర నిర్మాణాల విలువ రూ.60 కోట్లు. స్థానికులు, శాసనమండలి సభ్యులు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురామ్ చొరవతోనే తమ గ్రామం ఇంతలా అభివృద్ధి చెందిందని గ్రామస్తులు చెబుతున్నారు. ముఖ్యంగా రైల్ ఓవర్ రైల్వే ప్రాజెక్ట్‌లో భాగంగా రెండు ట్రాక్‌ల మధ్యలో మిగిలిపోయిన భూమిని కూడా రైల్వే శాఖ తీసుకునే విధంగా ఎమ్మెల్సీ తలశిల రఘురాం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రైతులకు తగిన నష్టపరిహారం వచ్చే విధంగా చేసిన కృషిని మరువలేమని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. కోవిడ్ కష్ట కాలంలో ఇంట్లో నుంచి బయటకు రాలేని నిస్సహాయ పరిస్థితుల్లో కూడా మేమున్నామంటూ గ్రామ వలంటీర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది వారి ఇంటికి వెళ్లి మెడికల్ కిట్స్ పంపిణీ చేశారు. ఆస్పత్రుల నిర్వాహకులతో మాట్లాడి అవసరం అయిన వారికి వైద్యం చేయించి వారి ప్రాణాలను కాపాడి తమ ఉదారతను చాటుకుంది తలశిల రఘురామ్ నేతృత్వంలోని గొల్లపూడి గ్రామ వైఎస్సార్ సీపీ.



నూతనంగా నిర్మించిన ఆర్‌బీ సెంటర్

గ్రామంలో అభివృద్ధి ఇలా..

- గ్రామ పంచాయతీ భవనం 2వ అంతస్తు నిర్మాణంతోపాటు మొత్తం భవనం ఆధునికీకరణ. గ్రామ ప్రజలకు పాలనాపరంగా అవసరమైన అన్ని సేవల నిమిత్తం ఐదు సచివాలయ భవనాలు. ఆరోగ్య పరిరక్షణకు ఐదు విలేజ్ హెల్త్ సెంటర్లు, రైతుల కోసం రెండు రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. ఇవి సేవలు అందిస్తున్నాయి.
- నాడు - నేడు పథకం ద్వారా గొల్లపూడిలోని జెడ్పీ స్కూల్, నల్లకుంటలోని ఎంపీయూసీ పాఠశాలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా అభివృద్ధి చేశారు. ఎస్‌పీఎస్‌ఆర్‌సీ హైస్కూల్‌ను ప్రభుత్వ స్కూల్‌గా మార్చి దాని నిర్వహణకు దాతలు ఇచ్చిన ఏడు ఎకరాల భూమిని ఎండోమెంట్ శాఖకు అప్పగించి అన్యాక్రాంతం కాకుండా కాపాడారు.
- కృష్ణానదీ తీరాన వైఎస్సార్ స్నాన ఘాట్‌ను నిర్మించారు.
- గొల్లపూడి మౌలానగర్‌లో వైఎస్సార్ మైనార్టీ ఫంక్షన్ హాల్, సూరాయపాలెంలో దాత అందించిన విరాళంతో అభయ వీరాంజనేయ స్వామి బీసీ ఫంక్షన్ హాల్ నిర్మాణం జరిగాయి. ల్యాంకో కాలనీలో గొల్లపూడి బీసీ ఫంక్షన్ హాల్ నిర్మాణం పనులు శరవేగంతో జరుగుతున్నాయి.
- ప్రభుత్వ నిధులు, దాతల విరాళాలతో కృష్ణానది ఒడ్డున హిందూ శ్మశానవాటికను నిర్మించారు.
- గొల్లపూడి దళితవాడలో కమ్యూనిటీ హాల్ భవనాన్ని నిర్మించి వినియోగంలోకి తీసుకువచ్చారు. అలాగే అంబేడ్కర్ నగర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులు, బొడ్డురాయి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి, కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి నిధుల కేటాయింపు.
- శ్రీనివాసనగర్, పోస్టాఫీస్ రోడ్డు, నేతాజీ నగర్, వస్త్రలత కాలనీ, ట్రిబుల్ ఎస్ కాలనీ, సాయిపురం కాలనీ, మౌలానగర్, నల్లకుంట, రామరాజ్య నగర్, దళితవాడ తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం. ముఖ్యంగా జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే అన్ని రోడ్లకు అప్రోచ్ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం.



వైఎస్సార్ మైనార్టీ కమ్యూనిటీ హాల్

- గ్రామంలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు దక్షిణ భారత దేశంలోనే తొలిసారిగా కంటైనర్ సబ్‌స్టేషన్ నిర్మాణం. గ్రామం మొత్తం ఎత్తైన విద్యుత్ స్తంభాలు, కొత్త లైన్ల ఏర్పాటు.
- గ్రామంలో నిరుపేదలైన 3,648 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడమే కాకుండా వాటికి రిజిస్ట్రేషన్ కూడా చేయించారు.

సేవ చేయడం కాదు..రుణం తీర్చుకోవడమే

మనం పుట్టి పెరిగిన గ్రామం కోసం పని చేయడం అంటే సేవ చేయడం కాదు..ముమ్మాటికీ రుణం తీర్చుకోవడమే అనే తలశిల రఘురామ్ మాటలను స్ఫూర్తిగా తీసుకుని గ్రామ పార్టీలోని ప్రతి నాయకుడు, కార్యకర్తలు సంఘటితంగా పని చేశాం. 2019లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామ అభివృద్ధితోపాటు పేదలకు ప్రభుత్వం అందించిన వివిధ సంక్షేమ పథకాలతో గ్రామస్తులు సుఖ సంతోషాలతో ఉండటం కంటే మాకు ఇంకా ఏం కావాలి. భవిష్యత్‌లో కూడా ఇదే అభివృద్ధి, సంక్షేమం కావాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొంటున్నారు గొల్లపూడి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు.



కంటైనర్ విద్యుత్ సబ్ స్టేషన్



సేవలందిస్తున్న విలేజ్ హెల్త్ సెంటర్

ఓటింగ్ సరళిపై సమీక్ష



తిరువూరులో పార్టీ నాయకులతో పోలింగ్ సరళిపై సమీక్షిస్తున్న స్వామిదాసు

తిరువూరు: రెండు నెలల పాటు ఎన్నికల ప్రచారంలో తలమునకలైన తిరువూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు పోలింగ్ ముగియడంతో మంగళవారం ఉల్లాసంగా కనిపించారు. తిరువూరులోని తన నివాసంలో పార్టీ ముఖ్య నేతలతో పోలింగ్ సరళిపై సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లను తరలించడంలో కీలకపాత్ర పోషించిన కార్యకర్తలు, నాయకులను స్వామిదాసు అభినందించారు. పోలింగ్ సరళి వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉందని పలువురు నేతలు తెలిపారు.

కార్యకర్తలు, ఓటర్లకు అభ్యర్థుల కృతజ్ఞతలు

నూజివీడు/తిరువూరు/మైలవరం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రెండు నెలలుగా తమ వెన్నంటి ఉండి ప్రచారంలో భాగంగా మండుటెండను సైతం లెక్కచేయకుండా తమతో పాటు పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ నూజివీడు, తిరువూరు, మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థులు మేకా వెంకటప్రతాప్ అప్పారావు, నల్లగట్ల స్వామిదాసు, సర్నాల తిరుపతిరావు వేర్వేరు ప్రకటనల్లో కృతజ్ఞతలు తెలిపారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి క్యూలో నిల్చొని ఓటు వేయడమే కాకుండా, రాత్రి పొద్దుపోయే వరకు ఓట్లు వేసిన ఓటర్లకు వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులందరూ ప్రచారంలో తోడ్పాటునందించారని చెప్పారు. వీరందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

21న భూముల కౌలు వేలం

చాట్రాయి: మండలంలోని చనుబండ కోదండ రామాలయం భూముల కౌలు హక్కు వేలం ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తామని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్థానిక రామాలయం ఆవరణలో ఉదయం 11 గంటలకు కౌలు వేలం జరుగుతుందన్నారు. రూ.4 వేలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని చెప్పారు.

పెరిగిన పోలింగ్ శాతం

- నూజివీడు పట్టణంలో 4 శాతం పెరుగుదల
- తిరువూరులో స్వల్పంగా..

నూజివీడు: సార్వత్రిక ఎన్నికల పోరులో భాగంగా ఈనెల 13న పోలింగ్ జరిగింది. నూజివీడు నియోజకవర్గంలో 87.94 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,38,981 మంది ఓటర్లు ఉండగా అందులో 2,10,161 ఓట్లు పోలయ్యాయి. పోలైన ఓట్లలో పురుషులు 1,05,051 మంది, మహిళలు 1,05,102 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైనప్పటికీ ఈవీఎంలు మొరాయించడంతో పలు చోట్ల పోలింగ్ ఆలస్యంగా కొనసాగింది. వీవీ ప్యాట్‌లను ఏర్పాటు చేయడం వల్ల కూడా పోలింగ్ మందకొడిగా సాగింది. నియోజకవర్గంలోని పలు చోట్ల రాత్రి 10.30 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మొత్తం 286 పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సజావుగా కొనసాగడంతో ఎన్నికల యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. అత్యధికంగా పోలింగ్ శాతం నూజివీడు మండలం అన్నవరంలోని 122వ పోలింగ్ బూత్‌లో 98.61 శాతం నమోదైంది. ఆగిరిపల్లి మండలం ఈదర పోలింగ్ స్టేషన్ 229లో 96.65 శాతం, నర్సింగపాలెంలో 96.54 శాతం, చాట్రాయి మండలం పర్వతాపురంలోని పోలింగ్‌స్టేషన్ 11లో 96.07 చొప్పున పోలింగ్ నమోదైంది. అత్యల్ప ఓట్ల శాతం నూజివీడు పట్టణంలోని పోలింగ్‌స్టేషన్ 160లో 63.77 శాతం నమోదైంది.

పట్టణంలో 77 శాతం పోలింగ్

నూజివీడు పట్టణంలో ఈ దఫా పోలింగ్ శాతం గతంలో కంటే పెరిగింది. మొత్తం 48 పోలింగ్ స్టేషన్లలో కలిపి 77 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019లో పట్టణంలో 73 శాతం పోలింగ్ నమోదు కాగా, 2024లో నాలుగు శాతం ఎక్కువ నమోదైంది.



ఓటు వేసేందుకు క్యూలో వేచి ఉన్న ఓటర్లు

తిరువూరులో స్వల్పంగా పెరుగుదల..

తిరువూరు: సార్వత్రిక ఎన్నికల్లో తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పోలింగ్ శాతం ఈ ఏడాది స్వల్పంగా పెరిగింది. 2019 ఎన్నికల్లో 2 లక్షల 3 వేల 436 మంది ఓటర్లలో లక్షా 76 వేల 453 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆ ఎన్నికల్లో 86.75 శాతం ఓటింగ్ నమోదైంది. ప్రస్తుత ఎన్నికల్లో 2 లక్షల 7 వేల 190 మంది ఓటర్లుండగా, లక్షా 81 వేల 669 మంది ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో 90,071 మంది పురుష ఓటర్లు, 91,594 మంది మహిళా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 87.68 శాతం ఓట్లు నమోదయ్యాయి. సోమవారం అర్ధరాత్రి వరకు పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మైలవరం నియోజకవర్గంలో 85 శాతం నమోదు

మైలవరం: మైలవరం నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్‌లో 85.36 శాతం ఓట్లు పోలయ్యాయి. గతంలో 82 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో 3.36 శాతం ఓటింగ్ పెరిగింది. నియోజకవర్గంలోని రెడ్డిగూడెం మండలంలో 39,877 మంది ఓటర్లు ఉండగా మైలవరం మండలంలో 54,914 మంది, జి.కొండూరు మండలంలో 47,847, ఇబ్రహీంపట్నం మండలంలో 89,036 మంది, విజయవాడ రూరల్‌లో 50,630, ఇతరులు 11 మందితో కలిపి మొత్తం 2,82,304 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,40,975 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చిన్న, చిన్న వివాదాలు తప్ప ఈ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగడంతో అధికారులు, పోలీసు సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఎన్నికల్లో మహిళలు మండుటెండను సైతం లెక్కచేయకుండా వరుసలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కౌంటింగ్ కేంద్రాలకు తరలిన ఈవీఎంలు

ముసునూరు: మండలానికి సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లు పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రానికి చేరుకున్నాయని తహసీల్దార్ జవహర్ బాజీ తెలిపారు. మండలంలోని 57 పోలింగ్ బూత్‌లలో నమోదైన పోలింగ్ వివరాలను మంగళవారం ఆయన తెలిపారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మండల వ్యాప్తంగా 90.37 శాతం పోలింగ్ నమోదైందన్నారు. లోపూడి, అక్కిరెడ్డిగూడెం, చింతలవల్లి, కాట్రేనిపాడు పోలింగ్ బూత్‌లలో ఈవీఎంల మొరాయింపు కారణంగా పోలింగ్ ఆలస్యమైందని చెప్పారు. దీంతో పోలింగ్ ముగిసిన తర్వాత అర్ధరాత్రి ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి ఈవీఎంలను తరలించామని వివరించారు.



ముసునూరు నుంచి కౌంటింగ్ కేంద్రానికి తరలుతున్న ఈవీఎంలు

జూపూడికి తరలిన ఈవీఎంలు

తిరువూరు: ఎన్నికల పోలింగ్ ముగియడంతో తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను జూపూడిలోని నోవా ఇంజినీరింగ్ కళాశాలకు మంగళవారం తరలించారు. సోమవారం తెల్లవారు ఝాము వరకు నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల నుంచి పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని రిసెప్షన్ కౌంటర్‌కు పోలింగ్ అధికారులు చేర్చారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మాధవి పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఈవీఎంలను భద్రపరచారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

పెద్దాపురం(వీరులపాడు): వాహనదారులు నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలని ఎస్ఐ మహాలక్ష్మణుడు పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో మంగళవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా ప్రతి ఒక్క వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులు సక్రమంగా లేకుండా తిరుగుతున్న 15 మందికి రూ. 4,500 అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఏషియన్ పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థికి బంగారు పతకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏషియన్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాకరపర్తి భావనారాయణ కళాశాల విద్యార్థి పి.భరత్‌కుమార్ బంగారు పతకాన్ని సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఈ నెల తొమ్మిదో తేదీన చైనాలోని హాంకాంగ్‌లో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న భరత్‌కుమార్ ఈ ఖ్యాతిని సాధించి తమ కళాశాల కీర్తిని, దేశ ప్రతిష్టను ఇనుమడింపజేశాడన్నారు. నగరానికి తిరిగి వచ్చిన భరత్ కుమార్‌కు రైల్వే స్టేషన్ వద్ద కళాశాల తరపున ఘనంగా స్వాగతం పలికి అక్కడి నుంచి కళాశాల విద్యార్థులు భారీ ప్రదర్శనగా తీసుకువచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సభలో భరత్‌కుమార్‌ను కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు సత్కరించారు. భరత్ కుమార్‌తో పాటు అతడిని తీర్చిదిద్దిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్రరావును అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



భరత్‌కుమార్‌ను అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు

రేపు బాబాకు అభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైశాఖ మాసం సందర్భంగా ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం బాబాకు వెయ్యి మామిడి పండ్ల రసంతో అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు మామిడి పండ్ల రసంతో అభిషేకం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు స్వయంగా మామిడి పండ్లు తీసుకువచ్చి అభిషేకంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సదావకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

15 నుంచి పాండురంగడి బ్రహ్మోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగస్వామి వారి ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 15వ తేదీన స్వామి వారి సన్నిధిలో రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగస్వామి వార్లకు పంచామృత తిరుమంజనం, పెళ్లికుమారుని, పెళ్లికుమార్తెను చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం స్వామి వారికి హంస వాహన సేవా కైంకర్యం, ఎదుర్కోలు ఉత్సవాలు జరుగనున్నట్లు తెలిపారు. 16వ తేదీ ఉదయం స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం జరుగనున్నట్లు తెలిపారు. సాయంత్రం వాహన సేవలు, సహస్ర దీపాలంకరణ సేవ ఉంటాయని పేర్కొన్నారు. 17వ తేదీన స్వామి వారికి పుష్పయాగం తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈనెల 18వ తేదీన స్వామి వారి పవళింపు సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

సూర్య భగవానునికి దశ సహస్ర గులాబీలతో అర్చన

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివజ్ఞాన పీఠంలో మంగళవారం సూర్యభగవానునికి పువ్వాడ కుసుమనాథ్ దంపతులచే పదివేల గులాబీలతో అర్చన జరిగింది. పీఠాధిపతి శివాచార్య సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి గులాబీలతో అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్ద సంఖ్యలో భక్తులు సూర్య భగవానుని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సహస్ర గులాబీలతో సూర్య భగవానుడు

ఉరుములతో కూడిన వర్షం

వత్సవాయి: ఎండ వేడిమి ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఉరుములతో కూడిన వర్షం పడడంతో ఊరటచెందారు. మంగళవారం సాయంత్రం ఆకాశంలో మబ్బులు కమ్మి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజలు సేదతీరారు.

- **కంచికచర్ల:** అకాల వర్షం కురవటంతో మంగళవారం ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఎండ వేడికి తట్టుకోలేక అల్లాడుతున్న సమయంలో ప్రకృతి కరుణించటంతో వాతావరణం చల్లబడింది. అర్ధగంట పాటు వర్షం కురిసింది. చల్లని వాతావరణంలో ప్రజలు సేద తీరారు.

నేటి నుంచి బాబా మందిర వార్షికోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ భగవాన్ షిర్డీ సాయిబాబా మందిరం 13వ వార్షికోత్సవాలు బుధవారం నుంచి ఘనంగా నిర్వహిస్తామని మందిర గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం ఆరు గంటలకు సంధ్యాహారతితో వార్షికోత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు సముద్రవేణి కోలాటం భక్త బృందం షిర్డీ సాయినాథుని ఊరేగింపుతో మధురానగర్ వీధులలో భిక్షాటన, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతాయని వివరించారు.